డీఎస్సీ పరీక్షలకు 1,085 మంది హాజరు

తిరుపతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు కేంద్రాల్లో మంగళవారం జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలకు 1,085 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. తిరుపతిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల పుత్తూరు శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్, గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలు, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఆర్ట్స్, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షలకు 64 మంది గైర్హాజరయ్యారు.

‘తోతాపురి’ని మద్దతు ధరతో కొనండి

దామలచెరువులో మామిడిరైతుల ధర్నా



పాకాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలను మద్దతు ధరతో కొనాలంటూ మంగళవారం మధ్యాహ్నం రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కిలోపై రాయితీ రూ.4 ఇస్తుండగా, రూ.8కి కొనాలని కోరారు. దామలచెరువు మ్యాంగోనగర్‌లో సోమవారం ఉదయం రూ.6 వంతున కొన్నారు. సాయంత్రం రూ.4 ధర చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం తక్కువ మంది రైతులే ట్రాక్టర్లలో మామిడి కాయలు తీసుకొచ్చారు. ర్యాంపుల్లో దళారులు రూ.4 ధర చెప్పడంతో ఆగ్రహిస్తూ చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి హైస్కూల్ గేటులో రోడ్డుపై బైఠాయించారు. ర్యాంపు యజమానులు, సప్లయర్స్ ఫ్యాక్టరీలు కిలోకు రూ.8 ఇస్తే ప్రభుత్వం రూ.4 ఇస్తుందని ప్రకటించినా ఫ్యాక్టరీలు కొనడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో దళారులు సిండికేట్ అయి ర్యాంపుల్లో తక్కువ ధరకు కొని.. ఎక్కువకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తోటల్లో పక్వానికి వచ్చిన మామిడి కాయలు రాలిపోతున్నాయని, వెంటనే కొనుగోళ్లు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దారు సంతోష్‌సాయి, సీఐ సుదర్శన ప్రసాద్, ఉద్యాన అధికారిణి శైలజ రైతులతో చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వీరు తీసుకొచ్చిన కాయలను బయట వ్యాపారులు రూ.6 చొప్పున కొన్నట్లు తెలిసింది.

శ్రీకాళహస్తి తడ రోడ్డు 6 లేన్‌గా విస్తరణ!



రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీ ఎస్‌ఈజెడ్‌కు నేరుగా రోడ్డు కనెక్టివిటీ పెంచేందుకు ఉద్దేశించిన కొత్త రోడ్డు నిర్మాణ ప్రతిపాదన రద్దయింది. దానికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ఉన్న శ్రీకాళహస్తి-తడ రోడ్డును సిక్స్ లేన్ విస్తరించే ప్రతిపాదన రూపుదిద్దుకుంటోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- సిద్ధమవుతున్న ప్రతిపాదనలు
- ఎయిర్‌పోర్టు నుంచి శ్రీసిటీకి రోడ్డు ప్రతిపాదన రద్దుతో ప్రత్యామ్నాయ చర్యలు

జిల్లాలోని శ్రీసిటీ సెజ్‌కు రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తామని ఈ ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో ప్రకటించారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి ప్రతినిధులు తరచూ శ్రీసిటీకి రాకపోకలు సాగించే నేపథ్యంలో ఎయిర్ పోర్టు నుంచి త్వరగా శ్రీసిటీ చేరేలా రోడ్డు యాక్సెస్ కల్పించాలని సీఎం భావించారు. దీంతోపాటు కొత్త రోడ్డు నిర్మాణం వల్ల రేణిగుంట, శ్రీసిటీల నడుమ ఇప్పటి దాకా మారుమూల వ్యవసాయ క్షేత్రాలుగా ఉన్న ప్రాంతాలకు, అక్కడి భూములకు విలువ పెరుగుతుందని, పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడులు వస్తాయని భావించారు. కొత్తగా నిర్మించే సిక్స్ లేన్ రోడ్డును ఆధారంగా చేసుకుని ఆ మార్గంలో కొత్త పారిశ్రామికవాడలు ఏర్పాటు చేయవచ్చని కూడా తలపోశారు. దానికనుగుణంగా ఎయిర్ పోర్టు నుంచి శ్రీకాళహస్తి మీదుగా ఇప్పుడున్న మార్గంలో కాకుండా రేణిగుంట నుంచి శ్రీసిటీకి కొత్త రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. దానిపై కలెక్టర్‌తో చర్చించి సర్వే చేయించాలని ఆదేశించారు. ఇటీవల శ్రీసిటీని సందర్శించిన సందర్భంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సైతం శ్రీసిటీ నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ పెంచుతామని ప్రకటించారు.

కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.4 వేల కోట్లు అవసరమని అంచనా

ప్రాథమిక సర్వేలో ఎయిర్ పోర్టు నుంచి నేరుగా శ్రీసిటీకి సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం అత్యంత వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని తేలింది. ప్రతిపాదిత మార్గంలో విలువైన పంట భూములు ఉండడం వల్ల వాటికి పరిహారం కింద ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని వెల్లడైంది. మరోవైపు మార్గంమధ్యలో అడ్డుపడే కొండ ప్రాంతాల మీదుగా రోడ్డు నిర్మాణానికి సాధారణ అంచనా వ్యయానికి మించి అనేక రెట్లు అధికంగా ఖర్చవుతుందని తేలింది. కనీసం రూ.4 వేల కోట్లు అవసరమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబాబుకు నివేదించారు. ఇప్పటికే రేణిగుంట నుంచి నాయుడుపేట, సూళ్లూరుపేట మీదుగా తడకు సిక్స్ లేన్ రోడ్డు కొత్తగా నిర్మాణం జరిగి ఉండడం, ఆ మార్గంలో తడకు చేరుకోవడానికి గంటన్నర సమయం మాత్రమే పడుతున్నందున మళ్లీ ఎయిర్ పోర్టు నుంచి శ్రీసిటీకి ప్రత్యేకంగా కొత్త రోడ్డు అవసరం లేదని సీఎంకు వివరించారు.

ప్రత్యామ్నాయంగా శ్రీకాళహస్తి-తడ రోడ్డు విస్తరణ ప్రతిపాదన

ఒకవేళ ప్రత్యామ్నాయం అవసరమని భావిస్తే ఇప్పటికే శ్రీకాళహస్తి నుంచి పదో మైలు, బీఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం మీదుగా తడ వరకూ ఉన్న డబుల్ రోడ్డును విస్తరిస్తే సరిపోతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ రోడ్డును డబుల్ రోడ్డు నుంచి ఫోర్ లేన్‌గా విస్తరించేందుకు ప్రతిపాదనలు ఇదివరకే ప్రభుత్వానికి పంపించామని, సీఎం ఆసక్తి కారణంగా ఆ ప్రతిపాదనలను సిక్స్ లేన్‌కు మార్చుకుంటే సరిపోతుందని నివేదించారు. దీంతో శ్రీకాళహస్తి నుంచి బీఎన్ కండ్రిగ, వరదయ్యపాళెం మీదుగా తడ వరకు ఇప్పుడున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్ రోడ్డుగా విస్తరించేందుకు సర్వే చేసి ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. కాగా శ్రీకాళహస్తి నుంచి ఇప్పుడున్న సిక్స్ లేన్ రోడ్డు మార్గంలో తడ 75 కిలోమీటర్ల దూరంలో ఉంది. అదే శ్రీకాళహస్తి నుంచి బీఎన్ కండ్రిగ, వరదయ్యపాళెం మీదుగా తడ నడుమ దూరం కేవలం 42 కిలోమీటర్లు మాత్రమే. కేవలం గంట వ్యవధిలో శ్రీసిటీకి చేరుకునే అవకాశముంటుంది. నిర్మాణ వ్యయం కూడా భారీగా తగ్గనున్న కారణంగా ప్రత్యామ్నాయ ప్రతిపాదన పట్ల సీఎం చంద్రబాబు మొగ్గు చూపించారు. ఆ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీకాళహస్తి - బీఎన్ కండ్రిగ - వరదయ్యపాలెం- తడ రోడ్డును సిక్స్ లేన్ రోడ్డుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించే పనిలో పడ్డారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ పనులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే నిధులు కేటాయించే అవకాశముంది.

ఆలస్యంగా ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్



బదిలీ పత్రాన్ని అందజేస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మూడు రోజుల విరామం తర్వాత మంగళవారం రాత్రి సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)ల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. చిత్తూరులోని షర్మన్ మెమోరియల్ బాలికల పాఠశాలలో రాత్రి 10.50గంటలకు కౌన్సెలింగ్ మొదలు పెట్టారు.డీఈవో వరలక్ష్మి ఎస్జీటీలకు బదిలీ పత్రాలను అందజేశారు.మంగళవారం సాయంత్రం 3.50 గంటలకు కౌన్సెలింగుకు హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు సూచించినా, రాష్ట్రస్థాయి నుంచి ఖాళీలకు సంబంధించి అధికారిక జాబితా రాకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది.మొత్తం 3,577మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.వీరిలో జడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లో 3190మంది టీచర్లుండగా, ప్రభుత్వ యాజమాన్యంలో నలుగురు, మున్సిపల్ యాజమాన్యంలో 214మంది, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో 169 మంది ఉన్నారు. తొలి దశలో 350మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.బుధవారం ఉదయం 10గంటలకు 351నుంచి 700వరకూ, మధ్యాహ్నం మూడు గంటలకు 701నుంచి 1000మంది ఎస్జీటీల వరకూ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తిరుపతి డీఈవో కుమార్, ఏడీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



బదిలీ కౌన్సెలింగ్ కోసం చిత్తూరు షర్మన్ స్కూల్లో చెట్ల కింద వేచివున్న టీచర్లు

నేడు శ్రీహరికోటలో యోగాంధ్ర రద్దు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గం శ్రీహరికోటలో బుధవారం జరగాల్సిన యోగాంధ్ర కార్యక్రమం వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరో మూడు రోజులు వర్ష సూచనలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండో రోజూ రగిలిన మహిళలు

- అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాలో ఆందోళన



గూడూరులో ఆందోళన



జీవకోనలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళల పట్ల సాక్షి టీవీ ఛానెల్ నిర్వహించిన డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై రగిలిపోయిన తిరుపతి జిల్లా మహిళలు వరుసగా రెండో రోజూ నిరసన, ఆందోళన కార్యక్రమాలు కొనసాగించారు. తిరుపతి జీవకోనలో మహిళలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా ఓ మహిళ పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా మిగిలిన మహిళలు అడ్డుకున్నారు. నిరసన కారులు అక్కడ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. కాగా ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో పలువురు మహిళలు రామచంద్ర పుష్కరిణి నుంచీ టౌన్ క్లబ్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. వెంకటగిరిలో మహిళలు ఎంపీడీవో కార్యాలయం నుంచీ పోలేరమ్మ ఆలయం ఆర్చి వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఆ సందర్భంగా సాక్షి పత్రిక ప్రతులను తగులబెట్టడంతో పాటు సాక్షి డిబేట్‌లో పాల్గొన్న కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు ఫొటోలను చెప్పులతో కొట్టారు. అనంతరం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గూడూరులో తెలుగు మహిళలు వివేకానంద రోడ్డు నుంచీ రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా టవర్ క్లాక్ కూడలి వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సాక్షి యాజమాన్యానికి, డిబేట్‌లో మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సాక్షి పత్రికలను, జగన్ ఫ్లెక్సీని దహనం చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి, తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి శ్రావణి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి నీలావతి తదితరులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. సూళ్లూరుపేటలో పాండురంగ వీధి నుంచీ ఆర్టీసీ బస్టాండు దాకా నిరసన ర్యాలీ చేపట్టిన తెలుగు మహిళలు అనంతరం బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. సాక్షి యాజమాన్యంపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పలువురు తెలుగుమహిళలు పాల్గొన్నారు. సత్యవేడులో టీడీపీ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో మహిళలు శ్రీకాళహస్తి బస్టాండు నుంచీ ఆర్టీసీ పెద్ద బస్టాండు వరకూ నిరసన ర్యాలీ నిర్వహించి సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పోలీసుల అదుపులో మధ్యప్రదేశ్ గ్యాంగ్

- చోరీలు, దోపిడీలకు పాల్పడిన ముఠా
- వేలి ముద్రలు, కనుబొమ్మల ఆధారంగా పట్టుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో చోరీలు, దోపిడీలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగతనాలు, దారి దోపిడీలు చేయడంలో ఆరితేరిన ఈ ముఠాలోని ఇద్దరిని పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన 20 మంది బృందాలుగా విడిపోయి.. ఒక్కో టీము ఒక ప్రాంతాన్ని ఎంచుకుని దోపిడీ, దొంగతనాలు చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు.. గతేడాది తిరుచానూరు, గాజులమండ్యంలోని మూడు ఇళ్లల్లో బెదిరించి బంగారు నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదు అపహరించుకుని వెళ్లినట్లు తెలిసింది. దీంతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు వంటి నగరాల్లో దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరిపై పలు ప్రాంతాల్లో పోలీసు కేసులు నమోదయ్యాయి. గతంలో కేరళ పోలీసులు అరెస్టు చేయగా, అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన వీరు మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. అందులోనూ పెద్ద, పెద్ద భవంతులు, కారు షోరూములు, ఎలక్ట్రానిక్ షోరూములను ఎంచుకుని 10 రోజుల పాటు రెక్కీ నిర్వహించాక అర్ధరాత్రి పూట చోరీలకు పాల్పడుతుంటారని పోలీసులు చెబుతున్నారు. అవసరమైతే వీరు రాష్ట్ర, జాతీయ రహదారులపై కాపుకాచి వాహనాలు ఆపి ఉంటే.. తుపాకులు, రాడ్లతో భయపెట్టి దోపిడీకి పాల్పడుతుంటారని సమాచారం.

ఎలా పట్టుబడ్డారంటే.. : తిరుపతి నగరం కాటన్‌మిల్లు.. రూరల్‌లో దామినేడు వద్ద మారుతీ కారు షోరూముల్లో సిబ్బంది కాళ్లు, చేతులు కట్టేసి రూ.7.30 లక్షలు నగదు అపహరించుకుని వెళ్లారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఈ ముఠాపై దృష్టి పెట్టారు. ఘటన జరిగిన ప్రాంతాల్లో వేలి ముద్రలు సేకరించారు. తిరుపతి ఫింగర్ ప్రింట్ పోలీసుల వద్దనున్న పాత నేరస్థులు, దోపిడీదారుల వేలి ముద్రలతో పరిశీలించారు. ఇందులో మధ్యప్రదేశ్‌కు చెందిన దోపిడీ దొంగ వేలి ముద్రలతో సరిపోయింది. దీంతో ఏఎస్పీ రవిమనోహరాచ్చారి ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, మరో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, సిబ్బందిని మూడు టీమ్‌లుగా విభజించి బెంగళూరు, మధ్యప్రదేశ్‌కు ఎస్పీ హర్షవర్ధన రాజు పంపారు. అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని దోపిడీ దొంగల మొబైల్ నెంబర్లు, ఆధార్ కార్డుల ఆధారంగా వారి కదలికలపై నిఘా పెట్టి ఇద్దరిని పట్టుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు.. వీరు దాదాపు 10 ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే ముఠాలో మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

రోడ్డు మార్జిన్ ఆక్రమణతో ఇబ్బందులు



కుచించుకుపోయిన పాకాల-తోటపల్లె రోడ్డు

పాకాల, జూన్ 10(ఆంధ్ర జ్యోతి): రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురికావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాకాల-తోటపల్లె రోడ్డుపై పలు చోట్ల ఇరువైపులా ర్యాంప్‌లు, మెట్ల నిర్మాణాలతో విస్తీర్ణం తగ్గిపోయింది. ఎదురుగా వాహనాలు వస్తే పక్కకు తొలగ లేని పరిస్థితి. ఈ మార్గంలో బస్సులు, ఇతర వాహనాలు వందల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. పరిసర గ్రామాల ప్రజలు పాకాలకు వచ్చి పోతుంటారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి అనుసంధానం కావడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువే. పూరిపేట, భారతంమిట్ట తొమ్మిదవ వీధిలో రోడ్డు ఆక్రమణలకు గురయింది. అడుసుపల్లె సమీపంలోని సామిరెడ్డి ఒడ్డు కట్టపై పేడదిబ్బలు, వ్యర్థాలు వేయడంతో రోడ్డు విస్తీర్ణం తగ్గిపోయింది. పాకాల నుండి తోటపల్లె వరకు వున్న రోడ్డు సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు

భాకరాపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని రాస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్లలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్‌లో సాగు చేసే పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, కోళ్ల-గొర్రెల పెంపకం, పశుపోషణ, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐకార్ శాస్త్రవేత్త మంజునాథ్, పశువైద్య శాస్త్రవేత్త అనూష, ఏవో ధనలక్ష్మి, సర్పంచులు నాగచంగమనాయుడు, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యటన

భాకరాపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చినగొట్టిగల్లు మండలంలో ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ కోరారు. బుధవారం భాకరాపేట మోడల్ కాలనీలో సీసీ రోడ్డు, చట్టేవారిపాళెం పంచాయతీ శ్రీనగర్ కాలనీ(భాకరాపేట సబ్-స్టేషన్ ఎదురుగా) సీసీ రోడ్లను నాని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు కూటమి నాయకులందరూ పాల్గొనాలన్నారు.

గంగమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం



చంద్రగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానికంగా మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 17వ తేది వరకు ఈవేడుకలు జరుగుతాయి. నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు గణపతి పూజ, పుణ్యవచనం, రక్షాబంధనం, కొడి స్థంభం పూజ నిర్వహించారు. 10.30 నుంచి 11 గంటల వరకు కొడి స్థంభం దీపం వెలిగించారు. సాయంత్రం ఆకుతోట వీధిలోని శక్తిరాయికి వివిధ రకాల అభిషేకాలు చేశాక ధర్మరాజుల ఆలయం నుంచి జాతర చాటింపు చేశారు. అక్కడ అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు పాదిరి రెడ్డిప్రకాష్, మృదుల,హేమశ్రీలు, చంద్రగిరి ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి శుభాకాంక్షలు



నేతలు, కార్యకర్తల నడుమ కేక్ కట్ చేస్తున్న కొండూరు ప్రవీణ్ రాయల్

చంద్రగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్ జన్మదిన వేడుకలను మంగళవారం మండలంలోని మల్లయ్యపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మల్లయ్యపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తల నడుమ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్ కేక్ కట్ చేసి, అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో దోర్నకంబాల మాజీ సర్పంచ్ చిట్టి, టీడీపీ నాయకులు యోగానంద, పేస్ రాయల్, బీగాల మహేష్, హరి, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలయ్య జన్మదిన వేడుక



చంద్రగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, బాలయ్య అభిమాన సంఘం నాయకుడు నరేష్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు, ప్రజలకు పంచిపెట్టారు. టీడీపీ తొండవాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, టీడీపీ నాయకులు హరి, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన



తిరుపతిరూరల్,జూన్10(ఆంధ్రజ్యోతి): గంగనగుంట, వేమూరు గ్రామాల్లో తిరుపతి భూలక్ష్మి ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ నమూనాపై రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయల సాగుపై అవగాహన కల్పించి, దేశీయవిత్తనాలని పంపిణీ చేశారు. సీఈవో డాక్టర్ కె.గంగాధరం మాట్లాడుతూ..రసాయన, పురుగుమందులు వాడిన ఉత్పత్తులు పలు అనారోగ్యసమస్యలకు కారణమవుతున్నాయన్నారు. ప్రతి కుటుంబం తక్కువ విస్తీర్ణంలో ఆర్గానిక్ విధానంలో కూరగాయలను సాగు చేసుకుని మంచి ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. బీజామృతం, ఘణజీవామృతం, వంటి ఆర్గానిక్ ప్రొడక్ట్స్ వాడాలని, నమూనా చుట్టూ రక్షణ ఏర్పాటు చేసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. ఎస్వీవ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఆర్గానిక్ సంస్థ సిబ్బంది, ఎండీవో గౌతమి పాల్గొన్నారు.

వైభవంగా ఆరేటమ్మ జాతర

పుత్తూరు టౌన్, జూన్ 10(ఆం ధ్రజ్యోతి): పట్టణ దేవత ఆరేటమ్మ జాతర వైభవంగా జరిగింది. మంగళ వారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టుకున్నారు. జాతరకు పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, ఈశ్వర్‌యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, కుప్పయ్య, భారతి, రవి హాజరయ్యారు. టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చెంచయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

చంద్రగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 16 నుంచి నెల రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిలాల గ్రామీణ ప్రాంతానికి చెంది తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు అర్హులు. 19-40 సంవత్సరాల మధ్య వయసుండి కనీసం పదోతరగతి చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫోన్ పేర్లను నమోదు చేసుకోవాలి. శిక్షణ సమయంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తారు. బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేయనున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్..7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రెండో అంతస్తు నుంచి దూకిన ఇంజనీరింగ్ విద్యార్థి

●ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స

తిరుపతి రూరల్,జూన్10(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని ఓప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ ప్రథమసంవత్సరం చదువుతున్న విద్యార్థి బాలాచారి మంగళవారం ఉదయం రెండో అంతస్తునుంచి కిందకి దూకడంతో కాలికి బలమైన గాయమైనట్లు తెలిసింది. అదే సమయంలో భవనం ముందు చెత ఊడ్చుతున్న మహిళపై ఆ విద్యార్థి పడడంతో పెద్దప్రమాదం తప్పింది, ఆమెకు నడుము వద్ద స్వల్పగాయమైందని కళాశాల వర్గాల ద్వారా తెలిసింది. గాయపడిన విద్యార్థిని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలియగానే తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు చోరీ సహా మహిళల మెడల్లో బంగారు గొలుసులను లాక్కెళ్లే ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... తిరుపతి నగరం ఎం.ఆర్.పల్లెకు చెందిన షేక్ అల్తాఫ్(19) బైక్ మెకానిక్. శ్రీకాళహస్తి మండలం నారాయణపురానికి చెందిన దుర్గాప్రసాద్(20) దినసరి కూలి. తిరుపతిలో కొన్ని సంవత్సరాల క్రితం స్నేహితులుగా మారారు. గంజాయి, మద్యం వ్యసనానికి బానిసైన ఇద్దరు తిరుపతి బస్టాండు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవారు. ఆ వాహనాలపై సంచరిస్తూ మహిళల మెడలోని గొలుసులను లాక్కెళ్లేవారు. అపహరించిన బంగారు ఆభరణాలను విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి విచారించగా తిరుపతి, శ్రీకాళహస్తి టూటౌన్, రూరల్, తొట్టం బేడుల్లో పలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు గుర్తించారు. రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు.

ఇసుక తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్ మూడు వాహనాల సీజ్

రేణిగుంట, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గాజులమండ్యం స్వర్ణముఖి నది తీర ప్రాంతంలోని పిల్లపాళ్యం వద్ద అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని మంగళవారం సమాచారం రావడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఇసుకను తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆర్థిక సమస్యలతో మహిళ ఆత్మహత్య



సుమలత (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి): ఆర్థిక సమస్యలతో మహిళ ఆత్మ హత్యకు పాల్పడింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... పట్టణంలోని చెంచులక్ష్మి గిరిజన కాలనీకి చెందిన సుమలత(40) అలియాస్ ఉష కూలి పనులపై జీవనం సాగించేంది. ఆర్థిక సమస్యలతో మంగళవారం ఇంటి వద్ద విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని భూపయ్య కాలనీ వద్ద కారు ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భూపయ్యకాలనీలో నివాసం ఉంటున్న బుజ్జమ్మ మంగళవారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుత్తుండగా నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బుజ్జమ్మను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

తీరంలో డ్రోన్ సర్వే

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలైన సిద్ధవరం, కర్లపూడిలో మంగళవారం భూముల డ్రోన్ సర్వే నిర్వహించారు. రెండురోజులుగా ఆయా పంచాయతీల్లో తహసీల్దారు జయజయరావు, మండల సర్వేయర్ జ్యోతిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆయా పంచాయతీల్లో ఇప్పటి వరకు 1575 ఎకరాల ప్రభుత్వ ప్రైవేట్ భూములను గుర్తించారు.



రాళ్లు తేలిన ఈ మార్గంలో నడవడమూ కష్టమే



వర్షం పడినప్పుడల్లా కొత్త నెన్నూరు రోడ్డు తీరింతే

ఈ దారిలో ప్రయాణం నరకమే

రామచంద్రాపురం మండలంలోని నెన్నూరు నుంచి కొత్త నెన్నూరుకు వెళ్లే రోడ్డు అన్ని సీజన్లలోనూ ఇబ్బందులు పెడుతోంది. మూడు కిలోమీటర్ల మేర ఈ రహదారిని గతంలో పంచాయతీ, అర్‌అండ్‌బీ పరిధిలో కాకుండా ప్రత్యేక నిధులతో నిర్మించారు. కొత్త నెన్నూరు నుంచి శాఖమూరుకండ్రిగ, కొత్తకండ్రిగతోపాటు ఐదు గ్రామాలను కలుపుతూ గణేశ్వరపురం వరకు ఇది ఉంటుంది. ఆరేళ్లుగా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో గుంతలమయమైంది. వర్షం పడితే మోకాలిలోతు బురద చేరుతోంది. వాహనచోదకులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలంలో రాళ్లతేలి పాదచారులకు పరీక్ష పెడుతున్నాయి. కాళ్లకు గాయాలవుతున్నాయి. ఈరోడ్డును బాగు చేయాలని ఐదు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. -రామచంద్రాపురం (ఆంధ్రజ్యోతి)

రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ



రైతులకు డ్రోన్లు అందజేస్తున్నఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. సబ్సిడీపై రైతు సంఘాలకు డ్రోన్లను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత సబ్సిడీ విత్తనాలు, మందులు, డ్రోన్‌లను పంపిణీ చేస్తోందన్నారు. మండలానికి సుమారు 502 క్వింటాల్ వేరుశనగ విత్తనాలు మంజూరు చేసిందన్నారు. క్వింటాల్ విత్తనాల ధర రూ.9600 అయితే ప్రభుత్వం సబ్సిడీ రూ.3840 ఇస్తోందన్నారు. రైతుకు రూ.5760కే అందుతాయన్నారు. 30 కేజీల ధర రూ.2790 అయితే సబ్సిడీపై రూ.1674కే అందిస్తోందన్నారు. వ్యవసాయ యంత్రీకరణ పథకం ద్వారా రైతులకు 15 రకాల వ్యవసాయ పనిముట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ఐతేపల్లి, ఎ.రంగంపేట రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే నాని పరిశీలించారు. ఐతేపల్లి రోడ్డు విస్తరణలో ఇళ్ళు, దుకాణాలు నష్ట పోతున్న వారు తమ సమస్యలను నాని దృష్టికి తీసుకెళ్ళారు. బాధితులందరికీ న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, టీడీపీ నాయకులు గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, సింగు సుధా పాల్గొన్నారు. .

మామిడి గుజ్జు ఫ్యాక్టరీల్లో తనిఖీలు



ఫ్యాక్టరీ వద్ద రైతులతో మాట్లాడుతున్న చిత్తూరు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్/గుడిపాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మామిడి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి రకం మామిడి తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి జేసీ విద్యాధరి, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరెడ్డి,ఆర్డీవో శ్రీనివాసులుతో కలిసి గుడిపాల మండలంలోని ఫుడ్ ఇన్స్ టాపా, గంగాధరనెల్లూరు మండలంలోని జైన్ మామిడి గుజ్జు ఫ్యాక్టరీలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మామిడి రైతులతో మాట్లాడి ఫ్యాక్టరీల వద్ద ఇబ్బందులేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు 80 మంది రైతులకు టోకెన్లను ఇస్తున్నారని, ఆ సంఖ్యను వంద వరకు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులందరి కాయలను తీసుకుంటామని, అదే సమయంలో పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే ఫ్యాక్టరీకి తీసుకురావాలని రైతులకు కలెక్టర్ సూచించారు. గుజ్జు ఫ్యాక్టరీల వద్ద మంగళవారం నుంచీ సీజన్ పూర్తయ్యేంతవరకు షిఫ్టులవారీగా పనిచేసేవిధంగా నియమించిన ఉద్యోగ బృందాలు ఉన్నాయో లేదో కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్టరీలకు మామిడిని చేరవేసిన రైతుల వివరాలను నమోదు చేసిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు.

చిత్తూరు యార్డుకు 350 టన్నుల మామిడి

చిత్తూరు సెంట్రల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మామిడి మార్కెట్ యార్డుకు మంగళవారం 350 టన్నుల మామిడి వచ్చింది.తోతాపురి, బేనీషా, కాలేపాడ్ రకాల మామిడిని యార్డుకు చుట్టుపక్కల ప్రాంతాల రైతులు తరలించారు. తోతాపురి కిలో రూ.12 నుంచి రూ.15 ధర పలకగా, బేనీషా కిలో రూ.15 నుంచి రూ.20, కాలేపాడ్ కిలో రూ.20 నుంచి రూ.30 ధర పలికింది. నాణ్యమైన మామిడి కాయలను మండీ యాజమానులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

సత్యవేడులో జాతరకు సర్వం సిద్ధం

సత్యవేడు, జూన్ 10 (ఆది వారం): గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. సత్యవేడు పరిసర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా అమ్మవారిని ప్రతిష్ఠించే గంగమిట్ట వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా పారిశుధ్య కార్మికులను నియమించారు. వేప చీరలు ధరించి మొక్కులు చెల్లించుకునే మహిళలు, పురుషులకు దుస్తులు మార్చుకునేందుకు వేర్వేరుగా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట్ల నీటి సరఫరాకు ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఈనెల 12న గురువారం అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ఈ సారి ఇనుప బ్యారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎండవేడిమి తగలకుండా చలువ పందిళ్ళు నిర్మిస్తున్నారు. అత్యవసర సేవల కోసం పదిమంది ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా విద్యుత్ అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకున్నారు.





తిరుమల శ్రీవారి జ్యేష్టాభిషేకంలో భాగంగా రెండోరోజు మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ముత్యపుకవచ ధారణతో మెరిసిపోయారు. ఆ రూపంలో భక్తులను అనుగ్రహించారు. ఏడాది ఒకసారి మాత్రమే ముత్యపు కవచాన్ని ధరించిన స్వామి ముగ్ధమనోహర రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. -తిరుమల(ఆంధ్రజ్యోతి)

గజలక్ష్మీ నమోస్తుతే

●తెప్పలపై అమ్మవారు సాక్షాత్కారం





తెప్పలపై విహరిస్తున్న పద్మావతి అమ్మవారు - గజవాహనంపై పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారంరాత్రి పద్మసరోవరంలో ఐదు చుట్లు విహరించారు. ఉదయం అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం వేడుకగా అభిషేకం చేశారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మపుష్కరణి వద్దకు వేంచేపు చేసి తెప్పలపై అధిష్ఠింపజేశారు. మంగళ వాయిద్యాలు, గోవింద నామ్మ స్మరణనడుమ ఐదు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. రాత్రి గజవాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. తెప్పోత్సవల్లో భాగంగా చివరి రోజు బుధవారం గరుడ వాహనసేవ జరగనుంది. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఎస్వో శైలేంద్రనాథ్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గరుడోత్సవం



గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఉదయం స్వామివారిని మోహినీ అలంకారంలో ఉంచి మాడవీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై ఉంచి మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీదుల్లో గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.


20 నుంచి ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20నుంచి 29వ తేదీ వరకు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల నుంచి 650 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాంప్‌లో డ్రిల్, షిప్ మోడరింగ్, ట్రెకింగ్, బ్లడ్ డోనేషన్, ఫైర్ ఫైటింగ్, రిగ్గింగ్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

కుప్పం రెడ్డెమ్మ అవార్డుల ప్రదానం రేపు

చిత్తూరు కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని డీఐ రోడ్డు రాజామహల్ హోటల్‌లో గురువారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కె.రోజాప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మా దాశరథి రచించిన సాహచర్య బంధం, డి.ఎన్.సుబ్రమణ్యం రచించిన అగ్రిమెంట్, అల్లూరి గౌరీలక్ష్మి రచించిన మలిసంజ కెంజాయ, శాంతి జయప్రకాష్ రచించిన అదృశ్యసంకెళ్లు నవలలు అవార్డులకు ఎంపికయ్యాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన రచయితలకు రూ.10 వేల నగదు అందించి సత్కరించనున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోగా వెంకటనారాయణ



చిత్తూరు రూరల్, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా వెంకటనారాయణను ప్రభుత్వం నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న జుబేదా డ్వామా శాఖ కడప జిల్లా విజిలెన్స్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తిరుపతి తుడా కార్యదర్శి వెంకటనారాయణను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ రాక

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం తిరుపతి పర్యటనకు రానున్నారు. ప్రధాని నరేంద్రమోదీ సేవా సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. 11వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఆయన తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కేబీఆర్ ఫంక్షన్ హాలుకు చేరుకుంటారు. 12.30 గంటలకు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు అక్కడే విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం 3 గంటలకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మొక్కలు నాటనున్నారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు పయనమవుతారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు మంగళవారం నగరంలో మొక్కలు నాటి, వికలాంగులకు ట్రైసైకిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో వారు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డ్ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ 24వ డివిజన్ ఇందిరానగర్‌లో మొక్కలు నాటారు. ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందజేశారు.

నిఘా వ్యవస్థను పటిష్టపరచండి

టీటీడీ సీవీఎస్వోను సత్కరించిన టీడీపీ నేతలు


టీటీడీ సీవీఎస్వోను కలిసిన ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేతలు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమ ల, తిరుపతిలో నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలని నిషేధిత వస్తువులు కొండకు వెళ్లకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని టీడీపీ నేతలు కోరారు. టీటీడీ సీవీఎస్వోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి మురళీకృష్ణను మంగళవారం ఆయన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి తాతయ్యగుంట గంగమ్మ తీర్థప్రసాదాలు అందించారు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కొందరు పనిగట్టుకుని తిరుమలపై దుష్ప్రచారం చేస్తున్నార న్నారు. అలాంటివి జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు, నాయకులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, ధనంజయ్, రవితేజనాయుడు, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో తుడా ప్లాట్లు



తిరుపతి, జూన్10 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయడానికి తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అనుకూలమైన ధరలతో ప్లాట్లను విక్రయిస్తోందని చైర్మన్ దివాకర్‌రెడ్డి తెలియజేశారు. రేణిగుంట మండలం సూరప్పకశంలోని పద్మావతినగర్ తుడా లేఔట్‌ను మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ చేసి వీలైనంత త్వరగా మౌలిక వసతులు కల్పించి వేలానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూరప్పకశం లేఔట్‌లో ఇంకా 270 ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడ సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ సుజన, ఇంజనీర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టాటా ఆర్ న్యూ అల్ట్రాజ్ కారు ఆవిష్కరణ


నూతన కారును ఆవిష్కరిస్తున్న ఆర్టీవో మురళీమోహన్

తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన విజయభారతి ఆటోమొబైల్స్ రెండో బ్రాంచ్‌ను జోనల్ మేనేజర్ జయదీప్‌గుప్త ప్రారంభించారు. ఎక్చేంజ్ షోరూంను రీజనల్ మేనేజర్ గోపికృష్ణ, టెర్రిటరి సేల్స్‌మేనేజర్ వి.గౌతమి సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన 'ది టాటా ఆల్ న్యూ అల్ట్రాజ్' కారును జిల్లా రవాణాధికారి మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టాటా మోటార్స్ విజయభారతి ఆటో మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వెంకట్రామన్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి మహిళలపై అవమానకర వ్యాఖ్యలపై

మండిపడ్డ మహిళా లోకం

- జగన్, కొమ్మినేని, సజ్జల బొమ్మలను చెప్పులతో కొడుతూ నిరసన
- జగన్ దిష్టిబొమ్మ దగ్ధం
- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఓ మహిళ



నిరసన తెలియజేస్తున్న మహిళలు

తిరుపతి (జీవకోన), జూన్ 10(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి.. వేశ్యల రాజధాని అంటూ జగన్ చానల్‌లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో మహిళలు మండిపడ్డారు. మంగళవారం జీవకోన పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి జగన్, కొమ్మినేని శ్రీనివాసరావు, సజ్జల రామకృష్ణారెడ్డిల బ్యానర్‌ను ప్రదర్శిస్తూ మహిళలు ర్యాలీగా బయలుదేరి సత్యనారాయణపురం కూడలి వద్దకు చేరుకున్నారు. మహిళా లోకానికి న్యాయం చేయాలంటూ ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని తన నిరసనను తెలియజేసింది. రాజధాని మహిళలను వేశ్యలు అంటూ హీనంగా మాట్లాడం తగదన్నారు. జగన్‌రెడ్డి, భారతిరెడ్డి వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని కోరారు. మహిళలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరసన అనంతరం జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. జగన్, కొమ్మినేని శ్రీనివాసరావు, సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్న బ్యానర్‌ను మహిళలు చెప్పులతో కొడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ మీడియాను రద్దు చేయాలి

తిరుపతి, జూన్10(ఆంధ్రజ్యోతి): అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో నిండిన ప్రాంతంగా దిగజారుడు వ్యాఖ్యలు చేయించి, ప్రసారం చేసిన జగన్ మీడియా సాక్షి ఛానల్ అనుమతులు రద్దు చేయాలని మహిళలు డిమాండు చేశారు. టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ ఆదేశాల మేరకు స్థానిక మహిళలు మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. వివాదానికి కారణమైన జర్నలిస్టులు, జగన చిత్రపటాలపై చెప్పులతో కొట్టి నిరసనలు తెలిపారు. పరారీలో ఉన్న జర్నలిస్టు కృష్ణంరాజును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 65వ జన్మదిన వేడుకలు తిరుపతిలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లిలోని జిల్లాపరిషత్ హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు టెన్త్ విద్యార్థులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా రూ.10వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానీ విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహిస్తున్న బాలయ్య అభిమానులను అభినందించారు. అనంతరం తిరుపతి సంజయ్ గాంధీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకూ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లతో పోటీపడి ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు.జిల్లా విద్యాశాఖ ఐటీ సెల్ పర్య వేక్షణాధికారి ధనంజయులు నాయుడు, ప్రధానోపాధ్యాయుడు బి.సుధాకర రెడ్డి, ఉపాధ్యాయులు వి.అనిల్‌కుమార్, ఆర్.అనిత కుమారి,కె.ప్రవీణ,ఎం.కవిత తదితరులు పాల్గొన్నారు. ఆపై బాలయ్య అభిమానులు రుయా ఆస్పత్రి, పాతమున్సిపల్ కార్యాలయ కూడలి, రేణిగుంటలోని అభయ క్షేత్రం తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున అన్నదానం చేశారు.ఈ కార్యక్రమాల్లో నందమూరి అభిమానులు కేపీ చౌదరి, మనోహర్ రెడ్డి, మదన్‌మోహన్, లోకేశ్ నాయుడు, షఫి, రవితేజ, రాకేశ్, పరశురాం, సుందరం, సుభాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీవీ నగర్‌లోని నడివీధి గంగమ్మ జాతరను పురస్కరించుకొని మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పట్టువస్త్రాలు, పూజాసామగ్రితో సారె సమర్పించారు. అనంతరం గంగమ్మను దర్శించుకొని ఆశీస్సులు స్వీకరించారు. అలాగే 19వ డివిజన్ పరిధిలోని శేషాద్రినగర్ నడివీధి గంగమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాజారెడ్డి, శ్రీహరినాయుడు, బలరాంరాయల్, బన్నీరాజు, సురేష్, సురేఖ, యశోద, జశ్వంత్, రవి, శ్రావణ్, ప్రభాకర్, ప్రదీప్, ఓంప్రకాష్, మధు, కళావతి, రంగారెడ్డి, మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖరేంద్ర సరస్వతి జయంతి

తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జగద్గురు చంద్రశేఖర్ సరస్వతిస్వామి 132వ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం నగరంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక కపిలతీర్థం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కంచిమఠం వరకు సాగింది. ఈ యాత్రలో కంచిపీఠాధిపతులు శంకర విజయేంద్రసరస్వతి, సత్య చంద్రశేఖర శంకరాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు మర్యాదపూర్వకంగా కలసి ఆశీస్సులందుకున్నారు.

వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పరిధిలోని చెన్నాయిగుంటలో వాకింగ్ చేస్తున్న మహిళ మెడ నుంచి గుర్తుతెలియని ముసుగు దొంగలు చైన్ దోపిడీ చేశారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ కథనం మేరకు.. చెన్నాయిగుంటకు చెందిన భారతి, మరికొందరు మహిళలు ప్రతి రోజూ కరకంబాడి -చెన్నాయిగుంట పంట పొలాల్లో వున్న రోడ్డులో వాకింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం భారతి వాకింగ్ చేస్తుండగా ముసుగు దొంగలు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆమె మెడలోని 24 గ్రాముల బంగారు చైను లాక్కుని ఉడాయించారు. బాధితురాలి తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేశారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

తిరుపతి(వైద్యం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతులైన చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వాముల వారి 132వ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతిలో నిర్వహించే శోభాయాత్రలో హిందువులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కంచి కామకోటి తిరుపతి మేనేజరు శ్రీధర్ శర్మ పిలుపునిచ్చారు. బ్రాహ్మణ సంఘం నేతలతో కలిసి ఆయన మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు.. ఈ శోభాయాత్ర కపిలతీర్థం నుంచి అన్నారావు సర్కిల్ వరకు మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సేవా సమితి నేతలు హరిప్రసాద్, కుమార్, మురళీశర్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్వంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ


డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి

తిరుతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణకు జాతీయ స్థాయిలో అగ్రగామి సంస్థ తిరుపతిలోని విశ్వం విద్యా సంస్థ అని ఆ సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాలయంలో జరిగిన నవోదయ, సైనిక్ ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకులను సాధిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ 2025 ఫలితాల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని వివరించారు. 6వ తరగతి గణితంలో 150/150 మార్కులు, ఇంటెలిజెన్స్‌లో 50/50 మార్కులు, 9వ తరగతి గణితంలో 200/200 మార్కులు విశ్వం విద్యార్థులు సాధించారని, ఇక నవోదయ ఫలితాల్లో ఏకంగా 47 సీట్లు పొంది ప్రభంజనం సృష్టించారని వెల్లడించారు. పోటీ పరీక్షలకు సంబంధించి ఇతర వివరాలకోసం 86888 88802 / 93999 76999 ఫొన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమ బోర్డు కోసం పోరుబాటకు సిద్ధంకండి

తిరుపతి(ఆటోనగర్)జూన్10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం హమాలీల కూలీలు పెంచాలని, హమాలీల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని శ్రీబాలాజీ లారీ లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌డీ రవి డిమాండ్ చేశారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం శ్రీబాలాజీ లారీ లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నగర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయని అందుకు అనుగుణంగా హమాలీల కూలీలు పెంచాలని కోరారు. అలాగే 50 ఏళ్ల నిండిన హమాలీ కార్మికులకు పింఛను రూ10 వేలు ఇవ్వాలన్నారు. వైద్యసదుపాయాలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం హమాలీలు పోరుబాటకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.బాబు, సారథి, సెంథిల్, మోహన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుజిరీ వ్యాపారులపై అక్రమ కేసులు అన్యాయం



తిరుపతి గుజిరీ వ్యాపారుల మహాసభలో ప్రసంగిస్తున్న ఎన్‌డీ రవి

తిరుపతి (ఆటోనగర్) జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా తుక్కు వ్యాపారాలు చేసుకుంటున్న గుజిరీలపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేయడం అన్యాయమని ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి పేర్కొన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య, క్రిష్ణారెడ్డి భవన్‌లో మంగళవారం గుజిరీ వ్యాపారుల రెండవ నగర మహాసభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను సేకరించే వారిపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని వ్యాపారులు భయాం దోళనలకు గురవుతున్నానరని తెలిపారు. నగరం శుభ్రంగా వుందంటే అది కేవలం గుజిరీల పుణ్యమే అన్నవిషయాన్ని అధికారులు గుర్తించుకోవాలని చెప్పారు. గుజిరీ వ్యాపారులకు అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం గుజిరీ వ్యాపారుల సంఘం కన్వీనర్ అల్లాబకష్ మాట్లాడుతూ ఈ నెల 20న తిరుపతిలో జరుగనున్న గుజిరీ వ్యాపారుల సంఘం మొదటి జిల్లా మహాసభలకు గుజిరీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమా వేశంలో నాయకులు సి.పెంచలయ్య, కెవై రాజా, శివ, పురుషోత్తం, మహేంద్ర, ఆర్.బాలన్, రాము, శ్రీరాములు, షకూర్, బాలాజీ, మురళీ, మహబుబ్‌బాష, సుబహాన్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం


నిరసన తెలుపుతున్న వైసీపీ మహిళలు

తిరుపతి (జీవకోన), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైసీపీ మహి ళలు ఆరోపించారు. మంగళవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా నాయకురాలు విజయలక్ష్మి, పునీత, పుష్ప, శారద, శాంతారెడ్డి, రాజేశ్వరి, యశోద, రాధ, మాధవి, కృష్ణవేణమ్మ, సాయికుమారి, షర్మిల, రెడ్డిరాణి, పార్వతమ్మ, కవితమ్మ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయంలో మంగళ వారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్ సేవ నేత్ర పర్వంగా కొనసాగింది. మొదట ఆలయం లోని అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీ శ్వరస్వామి ఉత్సవమూర్తుల కు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రహ్మకుమారీలకు టీటీడీ కల్యాణ మండపం ఎలా ఇస్తారు?

తిరుపతి(వైద్యం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారి సంస్థకు టీటీడీ కల్యాణ మండపాన్ని ఎలా కేటాయిస్తారని హిందూ సనాతన ధర్మ పరిరక్షణ సంస్థ జేఏసీ నేతలు కిరణ్, రమాదేవి టీటీడీ అధికారులను ప్రశ్నించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వీరు మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు... నాగలాపురంలో ఈ నెల 13 నుంచి 17 వరకు ఐదు రోజులు బ్రహ్మకుమారి సంస్థ నిర్వహించే కార్యక్రమానికి అక్కడి టీటీడీ కల్యాణ మండపాన్ని కేటాయించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు టీటీడీ ఎంతగానో కృషి చేస్తుంటూ అందులో పనిచేసే కొందరు అధికారులు హిందూ సంప్రదాయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం, టీటీడీ పెద్దలు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

త్వరలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సుల రాక



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు త్వరలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపేందుకు పినాకిల్ సంస్థ టెండర్ దక్కించుకుంది. వీటిని మంగళం డిపోకు కేటాయిస్తుండడంతో అక్కడే చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ యంత్రాంగం ఎస్పీడీసీఎల్ విభాగాన్ని సంప్రదించింది. రేణిగుంట సబ్‌స్టేషన్ నుంచి 33కేవీ లైన్ నేరుగా డిపోకు తీసుకువాలని కోరింది. ఇందుకయ్యే వ్యయం, డిపాజిట్ రూ.6కోట్లతో ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపింది. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మొదలుకానున్నాయి. అది పూర్తికాగానే డిపో గ్యారేజీకి పశ్చిమాన ఖాళీ స్థలంలో చార్జింగ్ స్టేషన్ పనులు మొదలుకానున్నాయి. దాదాపు 30 వరకు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలో వంద ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. తిరుమల-తిరుపతి, తిరుమల-రేణిగుంట, తిరుపతి-మదనపల్లె, కడప, నెల్లూరుకు నడుస్తున్నాయి.





కడసారి కష్టాలు

కేవీబీపురం మండలం వగత్తూరు గ్రామంలో మరణించిన వారిని కాటికి తీసుకెళ్లడానికి కడసారి కష్టాలు తప్పడం లేదు. గ్రామం ఏర్పడి 70 సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ శ్మశానానికి దారి లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల మీదుగా పాడె మోసుకెళ్లే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరిగినా శ్మశానానికి దారి ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే స్పందించి తమ శ్మశానానికి దారి ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

తిరుమల అడవుల్లో అగ్నిప్రమాదం

తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. శ్రీవారిపాదాల మార్గంలోని అడవిలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. ఈక్రమంలో వాహనదారులు, భక్తులు గమనించి వెంటనే ఫారెస్ట్, ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు ఫైర్ ఇంజిన్లలో మంటలను అదుపు చేశారు. . స్వల్పంగా మంటలు చేలరేగాయని, సకాలంలో అధికారులు, సిబ్బంది స్పందించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని టీటీడీ పేర్కొంది.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,258

తలనీలాలు సమర్పించినవారు: 33,502



వెనామీకి వైట్ పీకల్





వైట్ పీకల్‌తో చనిపోయి ఉన్న రొయ్యలు - కోట మండలం కొత్తపట్నంలో వైట్ పీకల్ సోకిన రొయ్యలను విక్రయానికి సిద్ధం చేస్తున్నరైతులు

● లక్షల్లో చనిపోతున్న రొయ్య పిల్లలు ● ఆక్వా రైతులను నిలువునా ముంచుతున్న వాతావరణ మార్పు

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పు, ఉష్ణోగ్రతలో తేడా ఆక్వా రైతులను నిలువునా ముంచుతోంది. వెనామీ రొయ్యలకు వైట్ పీకల్ (తెల్లపారుడు) వ్యాధి సోకి లక్షల్లో పిల్లలు చనిపోతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు. సముద్రతీర ప్రాంతమైన కోట మండలంలో ప్రధానంగా వెనామీ రొయ్యలు సాగును చేస్తున్నారు. కొత్తపట్నం, శ్రీనివాససత్రం, వావిళ్ల దొరువు, గోవిందపల్లి, దొరువుకట్ట ప్రాంతాల్లో రొయ్యలకు వైట్ పీకల్ వ్యాధి సోకి పిల్లలు చనిపోతున్నాయి. ఇదే అదునుగా బయ్యర్లు అడిగిన రేటుకు రొయ్యలను విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వైట్ పీకల్ లక్షణాలు

వెనామీ రొయ్య పిల్లలు 25నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకోగలుగుతాయి. అయితే రెండు రోజులు ముందు 40నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం, ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో వైట్ పీకల్ వ్యాధి సోకింది. దీంతో రొయ్యలు మేత తినకుండా రోజురోజుకు బలహీన పడి ఎదుగుదల ఆగిపోతోంది. ఊపిరాడక గంటల వ్యవధిలోనే చనిపోతున్నాయి. సాధారణంగా వెనామీ రొయ్యలకు మూడు నుంచి పది గ్రాముల బరువు వరకు వైట్ పీకల్ సోకుతుంది. ప్రస్తుతం పది గ్రాముల సైజులో కూడా వైట్ పీకల్ సోకుతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు.



బాలకృష్ణ పుట్టినరోజున తిరుమలలో 650 టెంకాయల సమర్పణ

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు తిరుమల శ్రీవారికి 650 కొబ్బరికాయలు సమర్పించారు. పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఉదయం అఖిలాండం వదఆరున్నర కిలోల కర్పూరం వెలగించి, 650 కొబ్బరికాయలు సమర్పించారు. నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలని శ్రీవారిని కోరుకుంటూ కొబ్బరికాయలు సమర్పించామని శ్రీధరవర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపేష్ వర్మ, సుబ్బు పాల్గొన్నారు.

అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న శ్రీధర్‌వర్మ, నేతలు

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై

అభయ హస్తాధీశుడి కటాక్షం

వడమాలపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారు దేవేరులతో కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయ హస్తాధీశుడిగా ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివార్లను మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. ఉదయం స్వామివారు స్వర్ణభరణాలతో సర్వాలంకార భూషితుడిగా పద్మావతీ, ఆండాల్ సమేతంగా రాజమన్నార్ అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాభూపాలురలను వాహనంగా చేసుకొన్న ప్రసన్న వేంకటేశ్వరుడు ప్రసన్నవదనంతో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలతో మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.





కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై దేవేరులతోకలిసి ఊరేగుతున్న శ్రీనివాసుడు

కమనీయంగా కమలానాథుడి కల్యాణోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమలానాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని పట్టు పీతాంబరాలతో వధూవరులుగా కల్యాణం పీటంపై అధిరోహింప జేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పయ్యాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శాస్త్రోక్తంగా ప్రసన్న వేంకటేశ్వరుడిచే ఉభయ నాంచారులకు మాంగళ్య ధారణ చేయించారు. పరిసరాలనుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.



నేడు శ్రీవారి గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న బుధవారం రాత్రి 7.00-8.30 గంటల మధ్య గరుడోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాల రాకపోకల నియంత్రణ కోసం ఆలయం అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీబీఐ అధికారి పేరిట బెదిరింపులు

● సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి రూ.1.20 కోట్లు పోగొట్టుకున్న రిటైర్డు టీచర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారినంటూ తిరుపతికి చెందిన రిటైర్డు టీచర్‌ను భయపెట్టి.. ఆమె నుంచి రూ.1.20 కోట్లను ఆన్‌లైన్ ద్వారా లాగేసుకున్న ఘటన అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. నవోదయ కాలనీలో నివాసమున్న రిటైర్డు టీచర్‌కు ఏప్రిల్ 16 నుంచి గత నెల 20వ తేది వరకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి పలు దఫాలుగా ఫోన్ కాల్స్ వచ్చాయి. తాను సీబీఐ అధికారినంటూ ఆ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. మీ ఆధార్ నెంబరు ఢిల్లీలోని కెనరా బ్యాంకులో మోసపూరితంగా ఉపయోగించి సదాఖత్ ఖాన్ అనే వ్యక్తి మానవ అక్రమ రవాణా చేస్తూ అకౌంటును వాడుతున్నాడని బెదిరించాడు. అనంతరం వీడియో కాల్ చేసి.. వెంటనే మీబ్యాంకు ఖాతాల సమాచారం ఇవ్వాలని, లేదంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు తెలియచేస్తామని భయపెట్టాడు. దీంతో ఆమె తనకున్న వివిధ బ్యాంకు ఖాతాల నుంచి ఆరు విడతలుగా దాదాపు రూ.1.20 కోట్లు సైబర్ నేరగాళ్ల అకౌంటుకు మార్చారు. దీనిపై తాను మోసపోయానని గుర్తించి ముందుగా సైబర్ సెల్ నెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు.

ఐసర్ రసాయన శాస్త్ర

ప్రయోగశాలలో అగ్నిప్రమాదం

● భయాందోళన చెందిన విద్యార్థులు, కార్మికులు ● తక్షణ చర్యలతో ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు

ఏర్పేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న కేంద్రియ విద్యా సంస్థ ఐసర్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్)లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రయోగశాలలోని ఒక రెఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల డబ్బాల నుంచి మంటలు వెలువడ్డాయి. దీంతో ప్రయోగశాల నుంచి పొగలు అలుముకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అధికారులు తక్షణమే స్పందించి భద్రతా చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పరికరాల నష్టం అంచనా వేయాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్నిప్రమాదం ప్రయోగశాలలో ఉన్న రిఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల వరకే పరిమితమైంది. ఐసర్ ప్రాంగణంలో ఉన్న అగ్నిప్రమాద నివారణ సదుపాయాలతో కేవలం ప్రయోగశాలకు మాత్రమే మంటలు పరిమితమైనట్లు తెలుస్తోంది.



ఐసర్‌లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో బయటకు వస్తున్న పొగ

ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు

ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడానికి సంస్థ స్వతంత్ర సత్య నిర్ధారణ కమిటీని(ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) ఏర్పాటు చేయనున్నట్లు ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక అందించనుంది.

వేరుశనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేరుశెనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేరుశెనగ విత్తనాలను విస్తారంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, తిరుపతి రూరల్‌లో 40 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డుతో విత్తనాలను తీసుకోవాలని సూచించారు.

'కింగ్‌డమ్'ను ఆదరించండి

- సినీనిర్మాత నాగవంశీ -



తిరుమల, జూన్10 (ఆంధ్రజ్యోతి): విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' చిత్రం జూలై నెలలో విడుదలకు సిద్ధంగా ఉందని, తప్పకుండా అందరు చూసి ఆదరించాలని కోరుకుంటున్నానని ఈ చిత్ర నిర్మాత నాగవంశీ తెలిపారు. రాష్ట్ర మంతి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు నాగవంశీ మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం తనవి రెండు చిత్రాల షూటింగ్ మొదలైందన్నారు. ఈసందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చినట్టు వెల్లడించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



కోన రవికుమార్, సభ్యులు

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ శాసనసభ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కోనా రవికుమార్, సభ్యులు, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజ, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్

ఎస్వీయూ యూజీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

తిరుపతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పరిధిలో 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్టు వర్శిటీ డీన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూజీ సప్లిమెంటరీ 6వ సెమిస్టర్ పరీక్షలు జరిగాయని, వాటికి సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఆయన వెల్లడించారు.విద్యార్థులు results.manabadi.co.in లింక్ ద్వారా ఫలితాలను చూడవచ్చని తెలియజేశారు.

తిరుపతి కార్పొరేషన్ పరిధి పెరగాలి

● 53వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తిచేస్తాం

● శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ రవికుమార్



తిరుపతి, జూన్10(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కార్పొరేషన్ పరిధి పెంచాల్సిన అవసరముంది. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతాం' అని శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని శ్రీ పద్మావతి సమావేశ మందిరంలో ఏపీ ఎస్పీడీసీఎల్, తిరుపతి స్మార్ట్ సిటీ, టూరిజం, టీటీడీ విభాగాలపై ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ విభాగాలపై త్వరలో లోతుగా చర్చించి, అన్ని నివేదికలను స్పీకర్ ముందుంచి లోటుపాట్లను సవరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో కొత్తగా 53 వేల వ్యవసాయ సర్వీసులు పూర్తి చేస్తామన్నారు. మరికొన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్లను గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్మార్ట్ సిటీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన గడువు మార్చికి ముగిసిందని, పనులన్నీ త్వరలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం కూడా విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 2ఆర్థిక సంవత్సర నిధులు పెండింగ్‌లో పెట్టడంతో పనులు నిలిచాయన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చాలా వరకు భూములు కేటాయించిందని, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టులను వినియోగంలోకి తెచ్చి ఆదాయ మార్గాలను వెతకాలని సూచించారు. రాష్ట్రంలో 16 ఏళ్ల తర్వాత పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ తొలిసారిగా పనిచేయడం ప్రారంభించిందన్నారు. ఇది స్టాట్యూటరీ కమిటీ అని, సభ్యులందరూ అందరికీ సుపరిచితులేనని అన్నారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీల్లో 186 కంపెనీలు ఉన్నాయని వివరించారు. ఈ కమిటీ తాలూకు విధివిధానాలను పరిశీలిస్తే అన్ని కంపెనీలకు సంబంధించి రివ్యూ చేయొచ్చన్నారు. కంపెనీ పర్ఫామెన్స్, ఆడిట్ రిపోర్ట్, ఎఫిషియన్సీ, కంపెనీ చట్టం ప్రకారం ఏర్పడినటువంటి కంపెనీలు, సొసైటీ చట్టం ప్రకారం ఏర్పడిన కార్పొరేషన్లకు సంబంధించిన ప్రతి కంపెనీ వార్షిక నివేదికలు అసెంబ్లీలో పొందుపరచాలన్నారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాలకు అనుమతులపై కమిటీ

● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): టిటిడి ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై వివిధ శాఖల అనుమతుల విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు.టీటీడీలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, ఇతర ఇంజినీరింగ్, మౌళిక సదుపాయాలపై టీటీడీ ఉన్నతాధికారులు చర్చించాలన్నారు. దిగువస్థాయిలో సమస్యలపై సీనియర్ అధికారులు చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వం స్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జీఎన్సీ, ఎస్వీ పూర్‌హోం, కేటీ, వినాయకనగర్, రామనగర్ ప్రాంతాల్లోని టీటీడీ క్వార్టర్స్‌లో డ్రైనేజీ సమస్యలు, భవనాల లీకేజీలు, విద్యుత్ తదతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డీఎల్వో వరప్రసాద్‌రావు, డిప్యూటీఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాప్ బోర్డులో క్రీడాకారిణి రజనికి స్థానం



తిరుపతి(క్రీడలు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్) బోర్డులో హాకీ క్రీడాకారిణి రజనికి చోటు లభించింది. మంగళవారం ప్రభుత్వం శాప్ బోర్డు సభ్యులను ప్రకటించింది. ఇందులో ఎర్రావారిపాళెం మండలం ఎనుములవారిపల్లెకు చెందిన రజనీకి అవకాశం కల్పించింది. ఈమె హాకీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించింది. గతేడాది ఎఫ్ఐహెచ్-5 ఎస్ వరల్డ్‌కప్‌లో సిల్వర్‌మెడల్, 2022 కామన్వెల్త్‌గేమ్స్, ఏసియాకప్‌లో బ్రాంజ్ మెడల్స్, టోక్యో ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. 2020లో జరిగిన టోక్యో ఒలంపిక్స్ ప్రాతినిథ్యం వహించింది. గడిచిన 15ఏళ్లుగా హాకీలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రంతో పాటు దేశానికి పేరుతెచ్చింది. ఆమె సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక శాప్ బోర్డులో స్థానం కల్పించింది. ఈ సందర్భంగా రజనిని పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.

వీఆర్‌కు వెంకటగిరి ఎస్ఐ

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. ఎస్ఐ సుబ్బారావు ఓ న్యాయవాది పట్ల దురుసుగా వ్యవహరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎస్ఐని వీఆర్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన గోవిందుడి బ్రహ్మోత్సవాలు



తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన చివరి ఘట్టంతో ముగిశాయి. ఉదయం పల్లకిపై స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్కరిణిలో కనుల పండువగా చక్రస్నానంనిర్వహించారు. తర్వాత పరిపాలన భవనం ఎదుట పీఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి





అమరావతిపై విషం కక్కడం తగదు



సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేస్తున్న టీడీపీ

సూళ్లూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై విషం కక్కడం తగదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి అన్నారు. అమరావతి, ఆ ప్రాంత మహిళల పట్ల సాక్షి టీవీలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక పాండురంగస్వామి గుడి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు టీడీపీ నాయకులు, మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించిచారు. బస్టాండు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. సాక్షి చానల్‌లో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంత మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, సుబ్రమణ్యం, బండారు అంజనేయులు, కన్నెమ్మ, సుజాత, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాది దుష్ట సంప్రదాయం



సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న మహిళలు

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అసత్య ప్రచారాలతో దుష్ట సంప్రదాయాన్ని అనుసరిస్తున్న సాక్షి పేపర్, చానల్‌పై నిషేధం విధించాలని మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటగిరిలో సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి పోలేరమ్మ ఆర్చి వరకు ర్యాలీగా వెళ్లి నిరసన ప్రదర్శన చేపట్టారు. అక్కడ సాక్షి పేపర్లు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తనూజారెడ్డి మాట్లాడుతూ అమరావతి ప్రాంత మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కొమ్మినే శ్రీనివాసులు, కృష్ణమ రాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరిని ప్రోత్సహిస్తున్న సాక్షి యాజ్యమాన్యం, మాజీ సీఎం జగన్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

నిరుద్యోగ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

నాయుడుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట డిగ్రీ కళాశాలలో మంగళవారం వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలలకొకసారి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, మొత్తం 128 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌వర్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, అవధానం సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గరుడోత్సవం



స్వామివారికి మాఢవీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఉదయం స్వామివారిని మోహినీ అలంకారంలో ఉంచి మాడవీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై ఉంచి మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఓజిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని గ్రామదేవత పోలేరమ్మకు మంగళవారం అంబలి పొంగళ్లు పెట్టారు. దేవాలయం నిర్మించి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో గ్రామస్తులు దేవాలయం వద్ద పూజలు చేశారు. అమ్మవారిని తీర్చిదిద్ది కొబ్బరికాయలు కొట్టి పెద్ద మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట

ఓజిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం అంగన్‌వాడీ బడిబాట - పిల్లలకు పూలబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఓజిలిలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు శ్యామల, సహాయకురాలు బంగారమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం ఉదయం 9.00నుంచి మధ్యాహ్నం వరకు కంటి పరీక్షలు నిర్వహించారు. 64మందికి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు ఎంపిక చేశారు. 70 మందికి కళ్ల అద్దాలు, 100 మందికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవానీ, ట్రస్టు ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది దిలీప్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం

సూళ్లూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ శాఖలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న వ్యవసాయ సహాయ సంచాలకురాలు జి.అనిత, ఏవో కవిత, సిబ్బంది చిరంజీవి, కృష్ణవేణిలను మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెస్టిసైడ్స్ అండ్ పెర్టిలైజర్స్ సీడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వాకచర్ల రమేష్, మెల్లకంట శ్రీనివాసులు, మునెయ్య, బాలాజి, శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారులను సన్మానిస్తున్న ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ నేతలు

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని భూపయ్య కాలనీ వద్ద కారు ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భూపయ్యకాలనీలో నివాసం ఉంటున్న బుజ్జమ్మ మంగళవారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుత్తుండగా నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బుజ్జమ్మను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

నేటినుంచి గిరిజనులకు ఆధార్ సేవలు

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు గిరిజనుల కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. బుధవారం చెందోడులో స్పెషల్ క్యాంప్ నిర్వహించి చెందోడు, చిట్టేడు, గూడలి-1, గూడలి-2, కేశవరం సచివాలయ పరిధిలోని గ్రామాల్లోని గిరిజనులకు ఉచితంగా ఆధార్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 13వ తేదీన కొక్కుపాడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామాల్లోని గిరిజనుల కోసం కొక్కుపాడులో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

పెళ్లకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు, పాలచ్చూరు పంచాయతీల్లో సిమెంట్ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పలు అభివృద్ధి పనులను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య తెలిపారు.



సూళ్లూరుపేట పోలీసుస్టేషన్, క్వార్టర్స్ ఆవరణలో తుప్పు పడుతున్న వాహనాలు

పట్టుబడితే... తుప్పు పట్టాల్సిందే!

పోలీసుస్టేషన్లలో మగ్గిపోతున్న వాహనాలు

సూళ్లూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు వాహనాలు పట్టుబడితే తుప్పుపట్టి భూమిలో కరిగిపోవాల్సిందే.. ఖరీదైన కార్లు, వ్యాన్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు.. ఇలా ఏ వాహనమైనా సరే పోలీసులకు చిక్కితే అంతే సంగతి. సూళ్లూరుపేట పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు పేరుకుపోతున్నాయి. స్టేషన్ ఆవరణలో స్థలం సరిపోక పోలీస్ క్వార్టర్స్ స్థలంలో పార్కింగ్ చేస్తున్నారు. అవి ఎండకు ఎండి.. వానకు తడిచి పనికిరాకుండా పోతున్నాయి.

కేసులు తేలక కొన్ని...

ప్రమాదాలకు గురైన వాహనాలు ఏళ్ల తరబడి కేసులు పూర్తికాక పోలీస్‌స్టేషన్ల ఆవరణలో ఉండిపోతున్నాయి. వాహన యజమానులకు జరిమానా విధించిన సందర్భాల్లో రుసుం చెల్లించి వాహనాలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే అప్పటికే వాహనం తుప్పుపట్టిపోవడంతో పాటు ప్రమాదాలకు గురైన వాహనాలను తిరిగి తీసుకువెళ్లేందుకు చాలామంది యజమానులు ఆసక్తి చూపడం లేదు. గంజాయి, మద్యం, ఎర్రచందనం అక్రమ రవాణా, చోరీ కేసుల్లో పట్టుబడిన వాహనాలదీ ఇదే పరిస్థితి. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో అధికంగా పట్టుబడిన వాహనాలు తుప్పుపట్టి మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆ వాహనాల్లోని బ్యాటరీలు, హారన్లు, ఇంజన్‌లోని విలువైన పరికరాలతో పాటు ఇతరత్రా మెటీరియల్ మాయం అవుతున్నాయన్న ఆరోపణలూ లేకపోలేదు.

వేలం వేయాల్సి ఉన్నా..

నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్న, చోరీ కేసుల్లో పోలీసులకు చిక్కిన వాహనాలను స్టేషన్‌కు తరలిస్తారు. వాటిని సీజ్‌చేసి రెవెన్యూ అధికారులకు సమాచారమిస్తారు. బహిరంగ ప్రకటన విడుదల చేసి ఆరు నెలల అనంతరం వేలం వేస్తారు. ఎక్సైజ్ కేసుల్లో సారా, అక్రమ మద్యం రవాణాకు సంబంధించి ఎప్పటికప్పుడు వాహనాలను వేలం వేస్తున్నారు. కానీ పోలీసు శాఖకు సంబంధించి వాహనాలను వేలం వేయడం లేదు. దీంతో స్టేషన్లలోనే పేరుకుపోయి తుప్పుపట్టిపోతున్నాయి.

సాక్షి మీడియాను నిషేధించాలి: పాశిం సంధ్యారాణి



గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సాక్షి దినపత్రికలను, మాజీ సీఎం జగన్ ఫ్లెక్సీలను దహనం చేస్తున్న తెలుగుమహిళలు

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించడమే కాకుండా వారి మనోభావాలను దెబ్బతీసేలా కథనాలను ప్రసారం చేసిన సాక్షి మీడియాను నిషేధించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి పాశిం సంధ్యారాణి అన్నారు. మంగళ వారం గూడూరు పట్టణం వివేకానంద రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వివేకానంద రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ముత్యాలపేట మీదుగా టవర్‌క్లాక్ సెంటర్ వరకు తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మాజీ సీఎం జగన్, భారతిరెడ్డి, జర్నలిస్టులు శ్రీనివాసరావు, కృష్ణంరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాక్షి దినపత్రికలను, జగన్ చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ సాక్షి మీడియాలో రాజధాని అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన జర్నలిస్టులు సభ్యసమాజం తలదించుకునేలా మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడడం మంచిపద్ధతి కాదన్నారు. ఇటువంటి చర్యలను మాజీ సీఎం జగన్, భారతిరెడ్డి ఖండించకపోవడం మహిళల పట్ల వారికున్న చులకన భావాన్ని రుజువు చేస్తోందన్నారు. మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని అమరావతి రాజధాని మహిళలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, శ్రీదేవి, భారతి, సుప్రజ, శైలజ, కల్పన, ప్రమీల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులో బదిలీలు

గూడూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)లో స్థాన చలనాలు ప్రారంభమయ్యాయి. మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న 33మంది ఉద్యోగులకు మంగళవారం బదిలీ ఉత్తర్వులు అందాయి. ఇందులో తిరుపతి జిల్లా పరిధిలో 11 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు బ్యాంకు చీఫ్ మేనేజర్ సత్యవతి నాయుడుపేటకు, నాయుడుపేట నుంచి హరికృష్ణ కుమార్ గూడూరుకు బదిలీ అయ్యారు. నెల్లూరు ప్రధాన శాఖలోని జీ.వెంకట్ వెంకటగిరికి, అక్కడి చీఫ్ మేనేజర్ టీ.రాజా సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. కాగా, సూళ్లూరుపేటలోని పీ.శ్రీనివాసమూర్తి నెల్లూరు డీఆర్ ఓఎస్‌డీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వెంకటగిరి బ్రాంచ్ మేనేజర్ ఏ.ఫణీంద్రబాబు ఇదే కార్యాలయానికి బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు.

ఆరుగురు అసిస్టెంట్ మేనేజర్ల బదిలీ

నాయుడుపేట బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ చెంగయ్య బదిలీపై గూడూరుకు రానున్నారు. ఇక్కడున్న ఐ.గురునాథం వెంకటగిరికి బదిలీ అయ్యారు. మరో అసిస్టెంట్ మేనేజర్ వి.దేవసేన నెల్లూరు ప్రధాన బ్యాంకుకు వెళ్లనున్నారు. అలాగే షేక్ చంద్‌బాషా వాకాడు నుంచి సూళ్లూరుపేటకు, షేక్ షర్మిలాబేగం కోట నుంచి నెల్లూరు ప్రధాన బ్యాంకుకు బదిలీ అయ్యారు. అలాగే గూడూరు బ్యాంకులో ఆర్.పద్మ కోట బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. వి సుకుమార్(ఎస్‌ఏ) వెంకటగిరి నుంచి కోటకు బదిలీ అయ్యారు. నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా మెట్టుకూరి ధనుంజయరెడ్డి పగ్గాలు చేపట్టిన రెండు రోజుల్లోనే భారీగా బదిలీలు చేపట్టడం చర్చనీయాంశమైంది.

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా అభివృద్ధి: విజయశ్రీ



పట్టణంలోని బేరిపేటలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంతో రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని బేరిపేట, రజకకాలనీలో మంగళవారం ఉదయం 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా వెళ్లి తెలుసుకొని పరిష్కరించడం కోసం గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డుల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఫజులుల్లా, తహసీల్దారు రాజేంద్ర, టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్, గంగాప్రసాద్, అవధానం సుధీర్, చెవూరి చెంగయ్య, పొట్లపూడి రాజేష్, సుబ్బారావు, నారాయణ, నిత్యకృష్ణారెడ్డి, మస్తాన్, లక్ష్మయ్య, సుబ్రహ్మణ్యం, బాబు, శోభన్‌నాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం



తైక్వాండో సాధన చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ యువ నేత నెలవల రాజేష్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన తైక్వాండో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. జూలై 25 నుంచి 27 వరకు విజయవాడలో జరగనున్న ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారని కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు ఎ.వినోద్‌కుమార్, నవీన్, లక్ష్మీప్రభ, ఆస్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకొన్నప్పుడే క్రమశిక్షణతో కలిగిన నడవడిక అలవడుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పింజలవీరయ్య కల్యాణ మండపంలో జరిగిన కిషోర వికాస వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. సెల్ ఫోన్లను సద్వినియోగం చేసుకుంటే ఎంత ప్రయోజనం ఉంటుందో దుర్వినియోగం చేస్తే అంతే దుష్పరిణామాలు ఉంటాయన్నారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలు, బాల్య వివాహల నిర్మూలన, చట్టాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి బహుమతులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం సంబంధించి స్టాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తనుజారెడ్డి, ఐసీడీఎస్ పీడీ వసంత బాయ్, సీఐ రమణ, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, సీడీపీవో షంషాద్ బేగం, టీడీపీ నాయకుడు మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి



కూటమి నాయకులు, కార్యకర్తలతో టీడీపీ నాయకుడు తానంకి నానాజీ

చిల్లకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 12వ తేదీన గూడూరులో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ అన్నారు. మంగళవారం చిల్లకూరులోని ఆయన నివాసంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 12న గూడూరు సంగం థియేటర్ సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభి రామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, నెల్లూరు రామ్మూర్తి, బెల్లంకొండ శివ, కాటూరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు



నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేటలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. గూడూరు డివిజన్ బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన నివాసంలో కేక్ కట్‌చేశారు. పొదర్తి ప్రకాష్ నాయుడు, చిరువెళ్ల మునిరాజ, ఆళ్ల రాజారెడ్డి, అత్తికాయల సుబ్రహ్మణ్యం, వాకిరి వెంకటే శ్వర్లు, దాసరి వెంకటేశ్వర్లు, మహదేవనాయుడు, సుబ్రహ్మణ్యం, నరసింహ నాయుడు, సిరాజ్, ఖలీల్, కిషోర్, రహమాన్, రఫీ, బాబు, చరణ్ పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, తూపిలి సురేంద్ర, శివకుమార్, దయాకర్, పార్వతయ్య, వెంకటేశ్వర్లు, భారతి, సందీప్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టీడీపీ సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు, వాకచర్ల రమేష్, సురేష్ నాయుడు, అలీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయండి

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీ నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని ఇస్కాన్ ప్రతినిధి సుఖ్‌దేవస్వామి అన్నారు. మంగళవారం పోటుపాళెంలోని లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బలభద్ర గోపదాసుప్రభు, పీఎం రావు, లక్ష్మి, రాజా, మయూరి శ్యామ్‌యాదవ్, మల్లయ్య పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



చందన అలంకారంలో గంగమ్మ

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని గంగమ్మ పరమేశ్వరిదేవి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని చందనంతో అలంకరించి పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పాండురంగస్వామి ఉత్సవాలు

దొరవారిసత్రం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం బుదూరు గ్రామంలోని రుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు దీక్ష మాలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టీటీడీ మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి పాండురంగ స్వామి పూజల్లో పాల్గొన్నారు.

20 నుంచి ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20నుంచి 29వ తేదీ వరకు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల నుంచి 650 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాంప్‌లో డ్రిల్, షిప్ మోడరింగ్, ట్రెకింగ్, బ్లడ్ డోనేషన్, ఫైర్ ఫైటింగ్, రిగ్గింగ్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ భవన్‌లో మంగళవారం పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి జీజీ నాయుడు, రవికుమార్, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో డ్రోన్ సర్వే

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలైన సిద్దవరం, కర్లపూడిలో మంగళవారం భూముల డ్రోన్ సర్వే నిర్వహించారు. రెండురోజులుగా ఆయా పంచాయతీల్లో తహసీల్దారు జయజయరావు, మండల సర్వేయర్ జ్యోతిరెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆయా పంచాయతీల్లో ఇప్పటి వరకు 1575 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించారు.

ఐటీఐకి కంప్యూటర్ పరికరాల అందజేత

వాకాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐటీఐకి శ్రీసిటీ ఆధ్వర్యంలో అప్రోటెక్ స్టీల్ కంపెనీ ఏఎండీ జైసన్‌జోసెఫ్ దాతృత్వంతో రూ.10 లక్షలు విలువ చేసే కంప్యూటర్ పరికరాలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవికి అందజేశారు. అప్రోటెక్ స్టీల్ కంపెనీ ప్రతినిధులను ఐటీఐ ప్రిన్సిపాల్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆప్రోటెక్ కంపెనీ ఎండీ అరుణ్‌మిరండా పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో ప్లాట్లు

తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి


సూరప్పకశం లే అవుట్ పరిశీలనలో దివాకర్ రెడ్డి

రేణిగుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల సొంతంటి కలను నిజం చేయడానికి తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అనుకూలమైన ధరలతో ప్లాట్లను విక్రయిస్తుందని తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని సూరప్పకశం పంచాయతీలో తుడా లేఅవుట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. లేఅవుట్ ప్లానింగ్, కమర్షియల్, రెసిడెన్షియల్‌కు కేటాయించిన ప్లాట్లను మ్యాప్ ద్వారా అధికారులు చైర్మన్‌కు వివరించారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ... సూరప్పకశం పద్మావతి నగర్ తుడా లే అవుట్‌లో ఇంకా 270 ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. తుడా కార్యదర్శి శ్రీకాంత్, ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్ సుజన, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, జాయింట్ ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, వాసుదేవరెడ్డి, ఏఈ రవీంద్రయ్య, డీఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాసుకుప్పం బైపాస్ రోడ్డు పరిశీలన


బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న జేసీ, ఎమ్మెల్యే

నాగలాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి - దాసుకుప్పం బైపాస్ రోడ్డుని ఎమ్మెల్యే ఆదిమూలంతో కలసి జేసీ శుభంబన్సల్ పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.26కోట్లకు ఆర్థిక అనుమతులు ఇవ్వాలని జేసీని ఎమ్మెల్యే కోరారు. అలాగే నాగలాపురం బస్టాండ్‌లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ హనుమాన్‌నాయక్, ఎంపీడీవో బాలాజీ నాయక్, వీఆర్వో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించండి

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం కోసం స్థలం కేటాయించాలని జేసీని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. నూతన భవనం నిర్మించే వరకు మినీ స్టేడియంలోని భవనాలలో కళాశాలను మార్చాలని కోరారు. ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

పిచ్చాటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కోరారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే, జేసీ పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిచ్చాటూరులో అరణియార్ డ్యాం వద్ద నిర్మాణంలో ఉన్న వ్యూ టవర్‌ను పరిశీలించారు. వ్యూ టవర్, చిల్డ్రన్స్ పార్కు, ఇతర పర్యాటక అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు విడుదల చేయాలని, ఎస్ఎస్‌బీ పేటలో 200 ఎకరాల ప్రభుత్వ భూమిలో స్థానిక పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని, మిగిలిన గ్రామాల్లో ఇల్లు లేని పేదలకు పట్టాలు మంజూరు చేయాలని, నీరువాయి సీజేఎఫ్ఎస్ భూములను పంపిణీ చేయాలని, కీళపూడికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, డిల్లీ, ఎం.ఎస్.రవి, రవిరెడ్డి పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే ఆదిమూలం జేసీ శుభం బన్సల్‌కు వివరించారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదయ్యపాళెం, కంచరపాళెం ప్రజలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని, గోవర్ధనపురం వంతెనను నిర్మించాలన్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్లు సుధీర్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్ సేవ నేత్రపర్వంగా కొనసాగింది. మొదట ఆలయం లోని అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్చకులు ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వడమాలలు, తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలలతోనే దేశ భవిష్యత్తు

ఏర్పేడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాలల భవితతోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి పిల్లలు తిరిగి బడిలోకి చేర్పించడంలో ప్రగతి సంస్థ విశేషంగా కృషి చేస్తోందని ప్రశంసించారు. చిన్నారుల బంగారు బాల్యాన్ని కాపాడం కోసం పోలీసులు ముందుంటారని చెప్పారు. జూన్ 12న అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది శిరీష, మురగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ...

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంఎల్‌హెచ్‌పీ శారద అన్నారు. మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సెల్వకుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

సూపర్ సిక్స్‌ను అమలు చేయాలి: సీపీఎం

పుత్తూరు టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను టీడీపీ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా ఇప్పటికీ కొన్ని పథకాలు పథకాలు అమలు కాలేదన్నారు. అర్హులకు ఇంటి స్థలాలు చూపాలని, గృహ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని, శ్మశాన సమస్యలు పరిష్కరించాలని కోరారు. జూలై 9న జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేఆర్ సుబ్రమణ్యం పిళ్లై, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరేటమ్మ జాతర


పొంగళ్లు పెట్టడానికి వెళ్తున్న భక్తులు

పుత్తూరు టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణ దేవత ఆరేటమ్మ జాతర వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టుకున్నారు. జాతరకు పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, ఈశ్వర్‌యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, కుప్పయ్య, భారతి, రవి హాజరయ్యారు. టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చెంచయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేతనాల కోసం ధర్నా

సత్యవేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ మంగళవారం సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు చిలకమ్మ, నెహత, బ్యూలా, దేవ, శాంతి, శీను తదితరులు పాల్గొన్నారు.

జాతరకు సర్వం సిద్ధం


గంగమిట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

సత్యవేడు, జూన్ 10 (ఆదివారం): గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. సత్యవేడు పరిసర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకు న్నారు. ముఖ్యంగా అమ్మవారిని ప్రతిష్ఠించే గంగమిట్ట వద్ద 24 గంటలు అందు బాటులో ఉండేలా పారిశుధ్య కార్మికులను నియమించారు. వేప చీరలు ధరించి మొక్కులు చెల్లించుకునే మహిళలు, పురుషులకు దుస్తులు మార్చుకునేందుకు వేర్వేరుగా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట్ల నీటి సరఫరాకు ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఈనెల 12న గురువారం అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ఈ సారి ఇనుప బ్యారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎండవేడిమి తగలకుండా చలువ పందిళ్ళు నిర్మిస్తున్నారు. అత్యవసర సేవల కోసం పదిమంది ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా విద్యుత్ అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకున్నారు.

డ్రోన్లతో నిఘా

జాతర సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. బందోబస్తు కోసం ఏఎస్పీ, డీఎస్పీ, నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 200 మంది సిబ్బందిని నియమించారు. మరో రెండు స్పెషల్ పార్టీలను కూడా ఏర్పాటు చేశారు. కాగా జాతరలో తొలిసారిగా డ్రోన్లతో నిఘాను పర్యవేక్షించనున్నారు. మంగళవారం పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో సీఐ మురళి, ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో డ్రోన్లను ఎగురవేసి పరిశీలించారు. అనుమానితులను అదుపులో తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించి, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

సాక్షి మీడియాను నిషేధించాలి

తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు


శ్రీకాళహస్తి , సత్యవేడు పట్టణాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు ప్రసారం చేసిన సాక్షి మీడియాను నిషేధించాలని తెలుగు మహిళలు నినదించారు. పట్టణం లోని చతుర్మాడ వీధుల్లో మంగళవారం సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి మీడియాలో పొలిటికల్ అనలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు రాజధాని అమరా వతిని అవమానించేలా, మహిళలను కించపరి చేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. మీడియా పేరుతో ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్న సాక్షి అనుమతులను రద్దు చేయాలన్నారు. తెలుగు మహిళలు రేణుకమ్మ, మల్లీశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా, మానవతా విలువలు గాలికి వదిలేసి, మహిళలను కించపరుస్తూ డిబేట్‌లు నిర్వహిస్తున్న సాక్షి టీవీని, పత్రికను రద్దు చేయాలని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. అమరావతిని వేశ్యల రాజధానిగా, అక్కడి మహిళలను వేశ్యలుగా వక్రీకరిస్తూ డిబేట్ నిర్వహించిన సాక్షి మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం సత్యవేడులో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. శ్రీకాళహస్తి బస్టాండ్ నుంచి తిరుపతి బస్టాండ్ వరకు పెద్ద ఎత్తున మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ నాయకురాలు శోభ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరించిన సాక్షి యాజమాన్యం ఇందుకు బాధ్యత వహించాలన్నారు. సాక్షి యాజమాన్యం తరఫున జగన్, భారతి రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పరమశివం, షణ్ముగం, చిన్న, సంతోష్‌కుమార్, లోకయ్యరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అమాసరెడ్డి, ఎంఎంరవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

సత్యవేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండల మీట్ బుధవారం ఉదయం ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన జరగనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో తరుణాక్షరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమశాఖలకు చెందిన పూర్తి స్థాయి నివేదికలతో మండల మీట్‌కు రావాలని కోరారు.

ఆర్థిక సమస్యలతో మహిళ ఆత్మహత్య


సుమలత (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో మహిళ ఆత్మ హత్యకు పాల్పడింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... పట్టణంలోని చెంచులక్ష్మి గిరిజన కాలనీకి చెందిన సుమలత(40) అలియాస్ ఉష కూలి పనులపై జీవనం సాగించేది. ఆర్థిక సమస్యలతో మంగళవారం ఇంటి వద్ద విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యూరీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

స్టీల్ ప్లాంట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

● సీఐటీయూ

రేణిగుంట, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన 3వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తికి కావాల్సిన గనులు ప్రైవేటు సంస్థలకు కేటాయించడంతోనే ప్లాంట్ నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. దీన్ని సాకుగా చూపి కార్మికులను తొలగించడం హేయమైన చర్య అని అన్నారు. సెల్వరాజ్, హరినాథ్, వెంకటరమణ, దిలీప్, భాషా, రాజశేఖర్, దీపా, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్ మూడు వాహనాల సీజ్

రేణిగుంట, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గాజులమండ్యం స్వర్ణముఖి నది తీర ప్రాంతంలోని పిల్లపాళ్యం వద్ద అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని మంగళవారం సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇసుకను తరలిస్తున్న ముగ్గు రిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు


చైన్ స్నాచర్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు చోరీ సహా మహిళల మెడల్లో బంగారు గొలుసులను లాక్కెళ్లే ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... తిరుపతి నగరం ఎం.ఆర్.పల్లెకు చెందిన షేక్ అల్తాఫ్(19) బైక్ మెకానిక్. శ్రీకాళహస్తి మండలం నారాయణపురానికి చెందిన దుర్గాప్రసాద్(20) దినసరి కూలి. తిరుపతిలో కొన్ని సంవత్సరాల క్రితం స్నేహితులుగా మారారు. గంజాయి, మద్యం వ్యసనానికి బానిసైన ఇద్దరు తిరుపతి నగరం, బస్టాండు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసే వారు. ఆ వాహనాలపై సంచరిస్తూ మహిళల మెడ లోని గొలుసులను లాక్కెళ్లేవారు. అపహరించిన బంగారు ఆభరణాలను విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి విచారించగా తిరుపతి, శ్రీకాళహస్తి టూటౌన్, రూరల్, తొట్టంబేడుల్లో పలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు గుర్తించారు. రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు.

ధర్మరాజస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు మంగళవారం నుంచి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయానికి సమీపంలో కొలువై ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయంలో వచ్చే నెల 17వ తేదీ నుంచి 12 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుక కోసం ముక్కంటి ఆలయ అధికారులు నెల రోజుల ముందు నుంచే పనులు ప్రారంభించారు. ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు, అగ్నిగుండం జరిగే ప్రదేశాన్ని శుభ్రం చేసే పనులు ప్రారంభించారు.

ఎన్ఎంఎంఎస్‌లో ఊరందూరు విద్యార్థుల హవా


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్షలో(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) ఊరందూరు ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది 8వ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో కూడా అత్యంత ఎక్కువమంది ఎన్నిక అయిన పాఠశాలగా నిలిచింది. మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆ విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు యేటా రూ.15వేలు ఉపకార వేతనం అందనుంది.

వీధి పశువులతో ట్రాఫిక్ ఇక్కట్లు


పిచ్చాటూరు రహదారిపై పశువుల సంచారం

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధిలో తిరుగుతున్న పశువులతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పశువుల సమస్య వాహనదారులను వెంటాడుతోంది. రద్దీ రోడ్లపై మూగజీవాలు తిష్ట వేస్తున్నాయి. పశువుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పలుచోట్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పశువుల సంచారంపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

తొట్టె నిర్మాణం పూర్తైనా ఎంబుక్‌లోకి ఎక్కలేదు!



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళెం పంచాయతీలో పల్లెపండుగ కార్యక్రమంలో నిర్మించిన పశువుల నీటి తొట్టె నిర్మాణం పూర్తి చేసినా ఇప్పటి వరకు ఉపాధి సిబ్బంది ఎంబుక్ రికార్డు చేయలేదని సర్పంచు హరిప్రసాద్ మంగళవారం ఎంపీడీవో వెంకటరత్నమ్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తొట్టె నిర్మాణానికి రూ.38వేలు మంజూరయ్యాయన్నారు. ఉపాధి హామీ అధికారుల సూచనల మేరకు నిర్మాణం పూర్తి చేసి మూడు నెలలు కావస్తున్నా ఎంబుక్ రికార్డు చేయలేదన్నారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్‌ను మూడు నెలలు నుంచి కోరుతున్నా పట్టించుకోలేదని తెలిపారు. పరిశీలించి న్యాయం చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

యథావిధిగా కాటూరు ప్రాథమిక పాఠశాల

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు ప్రాథమికోన్నత పాఠశాల విలీనం ఆగిపోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల విలీనంలో భాగంగా కాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని 6, 7, 8 తరగతులను పల్లమాల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం విలీనం చేసింది. దీంతో గ్రామస్తులు పాఠశాల విలీనం ఆపాలని వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి డీఈవోకు వినతిపత్రాలు అందజేశారు. అలాగే మాజీ ఎంపీపీ బి.రమేష్‌యాదవ్ దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలసి విన్నవించారు. పాఠశాలను గ్రామానికి చెందిన కిరణ్‌రెడ్డి దత్తత తీసుకుని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారికి విలీనం ఆపాలని ఉత్తర్వులిచ్చారు.

క్రికెట్ విజేత కల్లిపూడి

శ్రీకాళహస్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలో టీడీపీ నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి, కన్నలి ప్రవీణ్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం తుది పోరుకు కల్లిపూడి, కన్నలి జట్లు చేరుకున్నాయి. హోరాహోరీగా జరిగిన పోరులో కల్లిపూడి విజేతగా నిలిచింది. విజేతలకు రూ.10వేలు, జ్ఞాపికలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.5వేలు, జ్ఞాపికలు అందజేశారు.